

# ముళ్ళపంది

గుత్తుల భాస్కరరావు

శేషగిరి మంచివాడు కాదని వినికిడి.

అతని చరిత్ర ఆ వీధి అమ్మాయిలు చెబితే వినాలి.

"శేషగిరి ఎలాంటివాడంటే వాడి పేరు వ్రాసి బ్రాకెట్‌లో దొంగముండా కొడుకు అని వ్రాయొచ్చు."

"జ్వరం చూపులూ వాడూనూ. ఆడది కనిపిస్తే చాలు అతలకుతలమై పోతాడు."

"దౌర్భాగ్యుడికి పెళ్ళయిందట. అయినా పాడురోగం. ఆడవాళ్ళని చూపులతో జల్లించేస్తాడు."

"ఛి. వాడి చూపుల్లో ఎన్నిపాడు అర్థాలుంటాయో తెలుసా" యివి వాళ్ళ అభిప్రాయాలు.

మరో అమ్మాయి ఉంది. పేరుజ్యోతి. శేషగిరి అంటే తగని ద్వేషం. "ఆడ రాన్ని చూస్తే ముళ్ళపందిలా విచ్చుకుంటాడు. వెధవకి అక్కాచెల్లెళ్ళు లేరేమో" అంటుంది. ఒకసారి తనవెంట పడినప్పుడు ఆ మాటే అడిగింది. అతను "బావుంది. ఉన్న ఆడపిల్లలం దర్నీ అక్కాచెల్లెళ్ళతో పోల్చుకుంటే ప్రియురాళ్ళు మిగిలేదెలా?" అని మూతి తిప్పుకున్నాడు.




జ్యోతి కళ్ళు శేషగిరిని చూస్తే భగ్గున మండుతాయి. అలాగని చూడక మానదు. రోజుకోసారి అతన్ని చూసి ఉమ్మి తిట్టి వేళ్ళు విరవకపోతే ఆమెకు నిద్రపట్టదు. అన్నం సయించదు. ఆ ప్రయత్నంలో ప్రతి సాయంత్రం అతను 'బీటు'కు వెళ్లే సమయంలో కిటికీ ఊచలు పుచ్చుకొని ఖైదీలా ఎదురుచూస్తుంది.

శేషగిరి ఆ రోజు సాయంత్రం మామూలుగా ఆ దారిన వచ్చాడు. పోతూ పోతూ కిటికీవంక చూసి విషపు నవ్వొకటి విసిరాడు. ప్రతిగా జ్యోతి ఉమ్మింది. పళ్ళు పటపట లాడించింది. అవే శుభాకాంక్షలుగా భావించి ముందుకు నడిచాడు. ఎవరో స్త్రీ అతని కెదురుగా వస్తుంది. అందం వయసూ ఉన్నవేమో- ముఖ్యంగా అడదేమో - శేషగిరి వదల డనుకుంది జ్యోతి. ఆమె అనుకున్నట్టు గానే అతను ఆమెతో పెద్దగా నవ్వి మాట్లాడి - వెంటనే ముందుకు సాగి పోయాడు. జ్యోతికి వంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినయ్. ఆమెను ఎడ్యుకేట్ చెయ్యాలనిపించింది కిటికీ వదలి బైటికివచ్చి 'హలో' అని పిలిచింది. ఆమె ఆది ఏమిటన్నట్టు చూసింది.

"చూడండి. వాడు మిమ్మల్ని ఏదో కూసాడు. మీరు మెత్తగా ఊరుకున్నారేం. గట్టిగా బుద్ధి చెప్పకపోయారూ?"

"ఎందుకు?"

"వాడు పరమదుర్మార్గుడు. ఆడపిల్లలపాలిట శత్రువు. ఊరికే ఎవర్నీ పోనివ్వడు. ఏదో వాగుతాడు. వెంటపడతాడు."

"నాకు తెలియదు సుమా!"

"ఈ వీధిలో ఏ ఆడపిల్లనైనా సరే అడగండి. తలో కథ చెబుతారు."

"నేనెంత మోసపోయాను?"

"ఏం?"

"ఆయన నా భర్త."